సాక్షి
మెదక్
గురువారం । 13 । ఏప్రిల్ । 2023

కరాటేలో చిచ్చరపిడుగు



మెదక్ పట్టణానికి చెందిన బాలిక కరాటేలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తోంది. బరిలో దిగిందంటే పంచ్‌లు, కిక్‌లతో ప్రత్యర్థులను మట్టి కరిపిస్తోంది. 8లో

ముగ్గురికి కరోనా




మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా బుధవారం 86 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు జిల్లా వైద్యాధికారి చందూనాయక్ తెలిపారు. మెదక్‌లో రెండు, కొల్చారంలో ఒక కేసు నమోదైందని చెప్పారు. ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు.



నీటమునిగి రైతు మృతి

పశువులను మళ్లించేందుకు చెరువులోకి దిగి రైతు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన శివ్వంపేట మండల పరిధిలోని బొతులబోగూడ గ్రామంలో జరిగింది. 8లో



కొనుగోలు కష్టాలు తప్పేనా?

జిల్లావ్యాప్తంగా భారీగా పెరిగిన వరి సాగు

- గతేడాది తప్పని తిప్పలు
- దోపిడీని అరికట్టాలంటున్న రైతులు



కొల్చారం మండలంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి

కొల్చారం(నర్సాపూర్): జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా వరి సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. దీంతో ఈసారి పెద్ద మొత్తంలో ధాన్యం చేతికి రానుంది. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్న ప్రభుత్వ ముందస్తు చర్యలు ప్రతి ఏడాది కష్టాలు తెచ్చి పెడుతూనే ఉంది. ముఖ్యంగా ధాన్యం తూకం, రవాణాకు సంబంధించి దళారుల జోక్యాన్ని ప్రోత్సహించవద్దని రైతులు కోరుతున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈనెల మూడో వారంలో ప్రారంభమ్యే ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ప్రణాళిక చేయాలని సూచిస్తున్నారు.

జిల్లాలోఈయాసంగిలో 4 లక్షల 43 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అందుబాటులోకి వచ్చే అవకాశముంది. అందుకనుగుణంగా ఐకేపీ, డీసీఎంఎస్, రైతు ఉత్పత్తి సంస్థల ఆధ్వర్యంలో 406 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో సింగూరు నుంచి వనదుర్గా ప్రాజెక్టుకు సాగు నీటి విడుదల.. కాళేశ్వరం కాలువల ద్వారా గోదావరి జలాలు రావడంతో యాసంగిలో రైతులు అధిక శాతం వరి సాగు వైపే మొగ్గు చూపారు.

గతంలో ఎదురైన ఇబ్బందులు

- గతేడాది ప్రధానంగా కొత్త గన్నీ బ్యాగులు సరఫరా చేయాల్సి ఉన్నా చాలా కేంద్రాలు పాత వాటినే రైతులకు అందించారు.
- అవి కూడా సకాలంలో రాకపోవడంతో రోజుల తరబడి ధాన్యాన్ని తూకం వేయలేదు. దీంతో కేంద్రాల రైతులు పడిగాపులు గాశారు.
- కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసే సమయంలో అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండడం, కొనుగోలు కేంద్రాలు నడిపే వారు కొందరు దళారులుగా వ్యవహరించి తూకం విషయంలో జోక్యం చేసుకోవడం కనిపించింది.
- ఇక ధాన్యాన్ని రవాణా చేసే విషయంలో కొనుగోలు కేంద్రాల సిబ్బంది సైతం చేతులెత్తేసిన పరిస్థితి కనిపించింది.
- తూకం వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించే విషయంలోనూ రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.
- లారీల్లో తీసుకువచ్చిన ధాన్యాన్ని మాత్రమే అన్‌లోడ్ చేస్తామని, ట్రాక్టర్ల ద్వారా తీసుకు వచ్చిన ధాన్యాన్ని తీసుకోమని పేచి పెట్లారు.
- కొనుగోలు కేంద్రంలో వేసిన తూకానికి, రైస్ మిల్లులో వేసిన తూకానికి క్వింటాలలో వ్యత్యాసం రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.
- రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటామని చెబుతూ వచ్చిన అధికారులు క్షేత్రస్థాయిలో చేతులెత్తేయడంతో పంటను అమ్ముకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు.

అన్ని రకాలుగా నష్టపోతున్నాం



ప్రభుత్వం అన్ని రకాలుగా రైతులను ఆదుకుంటామని చెబుతున్నా వాస్తవ పరిస్థితికి, క్షేత్రస్థాయిలో చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. కొనుగోలు కేంద్రాల సిబ్బంది రైస్ మిల్లర్లతో కుమ్మకై ధాన్యాన్ని అధికంగా తూకం వేస్తున్నారు. రైస్ మిల్లులపై అధికారుల చర్యలు కంటి తుడుపుగానే ఉంటున్నాయి. – బీరప్ప, రైతు, రంగంపేట

ఇబ్బంది లేకుండా చూడాలి



ధాన్యం తూకం వేయడం మొదలుకొని రవాణా చేసే విషయంలో చిన్న రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేలా అధికారులు దృష్టి పెట్టాలి.
– అంజయ్య, రైతు, తుక్కాపూర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, పక్కన కలెక్టర్ రాజర్షిషా, అధికారులు

రైతులకు ఇబ్బంది లేకుండా చూడండి

- మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి
- అధికారులు, రైస్‌మిల్లర్లతో సన్నాహక సమావేశం

మెదక్‌జోన్: గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ద్వారకా గార్డెన్‌లో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అధికారులు, రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన కాంటాలు, తేమను కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, అవసరం మేరకు గన్నీ సంచులు నిష్పత్తి ప్రకారం అందించాలని సూచించారు. వేసవి దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో షామియానా, తాగు నీరు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రానికి, మిల్లుకు ట్యాగింగ్ చేసిన ప్రకారం ధాన్యం రావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని అటువంటివి జరగకుండా చూడాలని అధికారులకు చెప్పారు. రైతులు అటవీ భూముల్లో పండించిన ధాన్యాన్ని సైతం తీసుకోవాలని, ఇందుకు సంబంధించి వ్యవసాయ అధికారులు పంట వివరాలు నమోదు చేసి ఎంత ధాన్యం వస్తుందనే వివరాలు తెలుసుకోవాలన్నారు.

సమష్టిగా పనిచేయాలి: కలెక్టర్

గోనె సంచుల కొరత లేదని, మానిటరింగ్ చేసేందుకు ఇద్దరు సీనియర్ అధికారులను నియమించామని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. కొనుగోళ్ల ప్రక్రియ ముగిసే 45 రోజులు అధికారులు సమష్టిగా పనిచేయాలని, ఎటువంటి సెలవులు మంజూరు చేయమని చెప్పారు. గతంలో బాగా చేశామన్న మితిమీరిన ఆత్మవిశ్వాసంతో కాకుండా లోటుపాట్లను గుర్తించి అధిగమించాలని అధికారులకు సూచించారు. రైతులకు వెంటనే డబ్బులు చెల్లించే విధంగా ట్యాబ్ ఎంట్రీ పక్కాగా చేయాలన్నారు. సమస్యలుంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు సమాచారం అందించాలన్నారు. 2021–22 రబీకి సంబంధించి సీఎంఆర్ రైస్ పూర్తి చేసి ధాన్యం నిల్వకు స్థలం ఏర్పాటు చేసుకోవాలని రైస్ మిల్లర్లకు సూచించారు. అదేవిధంగా ధాన్యం భద్రపరిచేందుకు గోదాంలను గుర్తించామని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేశ్, జిల్లా రైస్ మిల్లర్స్ సంఘం అధ్యక్షుడు చంద్రపాల్, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి ఆశాకుమారి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మున్సిపల్ దుకాణాలకు టెండర్ వేయండి



అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

మెదక్ కలెక్టరేట్: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల మున్సిపల్ దుకాణాలకు వెంటనే టెండర్ వేయాలని నిరుద్యోగ యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. టెండర్లు వేయడంలో మున్సిపల్ కమిషనర్ తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకొని నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బాల్‌రాజ్, భాస్కర్, సుధాకర్, నవీన్, రంజిత్ నాయక్, ప్రేమ్‌సింగ్, ప్రభాకర్, గోపాల్ నాయక్, శ్రీనివాస్, ప్రవీణ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం సందర్శన



పరీక్ష కేంద్రం వద్ద డీఈఓ రాధాకిషన్

చిన్నశంకరంపేట(మెదక్): జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతగా ముగిశాయని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఒకేషనల్ పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 10,700 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని పేర్కొన్నారు. జిల్లాలోని 8 మండల కేంద్రాల్లో ఒకేషనల్ పరీక్షలు నిర్వహించగా, ఎనిమిది వందల మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని వివరించారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని కిష్టాపూర్‌లో నివాసం ఉంటున్న పేదలకు జీఓ 58, 59 ప్రకారం పట్టాలు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. బుధవారం చేగుంట తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధిత కుటుంబాలతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మణ్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సర్వే నంబర్ 10లో పేదలు 30 ఏళ్ల క్రితం ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నారని తెలిపారు. పట్టాలు ఇవ్వాలని దరఖాస్తు చేసుకుంటే బెదిరింపులకు గురిచేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు నాగమణి, సమీరా, సిద్ధవ్వ, స్వరూప, బాలమణి పాల్గొన్నారు.

వైద్య విధానాలపై అవగాహన అవసరం

నర్సాపూర్: వైద్య పరమైన అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి అనిత హితవు పలికారు. బుధవారం కోర్టు ఆవరణలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎవరికైనా అకస్మాత్తుగా గుండెపోటు వస్తే దాని నుంచి సదరు వ్యక్తిని కాపాడేందుకు దోహదపడే సీపీఆర్ విధానాన్ని అందరు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజిరెడ్డి, ప్రభుత్వ న్యాయవాది రాఘవేంద్ర, సహాయ న్యాయవాది సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని



మాట్లాడుతున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా సిబ్బంది పనిచేయాలని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని.. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. పెండింగ్ కేసులు త్వరగా ఛేదించాలని, పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్ త్వరగా ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణపై గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో మెదక్ డీఎస్పీ సైదులు, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, ఆర్‌ఐ నాగేశ్వర్‌రావు, డీసీఆర్‌బీసీఐ శ్రీధర్, ఎస్‌బీ ఎస్‌ఐ రమేశ్, ఐటీకోర్ ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దళితులను మోసం చేసిన కేసీఆర్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్, పక్కన నాయకులు

నర్సాపూర్: దళితులను సీఎం కేసీఆర్ మోసం చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత ముఖ్యమంత్రికి లేదన్నారు. రాష్ట్రంలో కుటుంబ, అరాచక పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. దళిత వ్యతిరేకిగా వ్యవహరిస్తున్న సీఎం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించవద్దన్న డిమాండ్‌తో తమ పార్టీ ఆధ్వర్యంలో నేడు నిరసన ర్యాలీలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో నర్సాపూర్‌లో బైక్ ర్యాలీ చేపట్టాలని నిర్ణయించామని.. కార్యక్రమానికి మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. నియోజకవర్గంలోని దళిత మోర్చా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్, నాయకులు జగన్, యాదగిరి, మల్లేష్‌గౌడ్, సురేష్, రఘువీరారెడ్డి, రాంమోహన్‌గౌడ్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే పేదరిక నిర్మూలన

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, చిత్రంలో బోడకుంటి వెంకటేశ్వర్లు, తదితరులు

తూప్రాన్: దేశంలో పేదరిక నిర్మూలన బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందని రాష్ట్ర అటవీ, అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని లింగారెడ్డి గార్డెన్‌లో బీఆర్‌ఎస్ పట్టణశాఖ అధ్యక్షుడు సతీష్‌చారి అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్ హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే బలం అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ ప్రభుత్వంపై బురద చల్లిందుకు కుట్రపన్నుతున్నారని విమర్శించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ పేదల కోసం ఏమి చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి బీజేపీపై చేయాల్సిన విమర్శలు బీఆర్‌ఎస్‌పై చేయడం ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. యశోద ఆస్పత్రులకు పదేళ్ల క్రితం రూ. 800 కోట్ల భూములను కేవలం రూ. 100 కోట్లకు కేటాయించారని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. అప్పట్లో ఉన్న ధరలు, ఇప్పటి ధరలతో పోల్చడం ఎంత వరకు సమంజసమన్నారు. రాహుల్‌గాంధీపై బీజేపీ కేసులు బనాయించి జైలులో పెట్టేందుకు కుట్ర చేస్తే తెలంగాణలో కనీసం కాంగ్రెస్ జెండాలు కనిపించలేదని ఎద్దేవా చేశారు. నిరుద్యోగుల కోసం గజ్వేల్‌లో నిరసన చేపడుతానని రెచ్చగొట్టే పనులు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్లు ఎలక్షన్‌రెడ్డి, భూంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ దీపక్‌రెడ్డి, కొట్టాల యాదగిరి, చంద్రారెడ్డి, నాగరాజు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, రాజేశ్వరశర్మ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై క్షేత్రస్థాయి పరిశీలన



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షిషా, అధికారులు

మెదక్ కలెక్టరేట్: ఓటరు జాబితాను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి రవికిరణ్ హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ రమేశ్, ఆర్డీఓ సాయిరాం, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వికాస్‌రాజ్ ఓటర్ జాబితాలో ఫొటో సిమిలర్ ఎంట్రీస్ ధ్రువీకరణ, ఓటర్ ఎపిక్ కార్డుల జారీ, బూత్ లెవెల్ అధికారుల నియామకంపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో తొలగించిన ఓటర్ల వివరాలను మరోసారి పరిశీలించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మరణించిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన, ఫొటోలు మిస్ మ్యాచ్ అయిన వివరాలను ధ్రువీకరించుకుంటామని పేర్కొన్నారు. కాగా జిల్లాలో 583 ఓటర్ల పేర్లు తొలగించామని చెప్పారు. తిరిగి వాటిని ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పరిశీలించి వారం రోజుల్లో అప్‌డేట్ చేస్తామని తెలిపారు.

లాజిస్టిక్ పార్కుపై కదలిక

- గజ్వేల్‌పై పరిశ్రమల శాఖ దృష్టి
- నియోజకవర్గంలో భూసేకరణకు కసరత్తు
- మనోహరాబాద్ లేదా ములుగు మండలాల్లో అనుకూలతపై అధ్యయనం



గజ్వేల్‌లోని ఎరువుల రేక్ పాయింట్

గజ్వేల్: భూసేకరణ సమస్యతో పెండింగ్‌లో ఉంటూ వస్తున్న ప్రతిష్టాత్మక మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు అంశంలో కదలిక వచ్చినట్లు తెలుస్తోంది. సీఎం కేసీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో ఈ భారీ ప్రాజెక్ట్ ఏర్పాటు అంశాన్ని పరిశ్రమల శాఖ పరిశీలిస్తోంది. ఈ క్రమంలోనే నియోజకవర్గంలోని మనోహరాబాద్ లేదా ములుగు మండలాల అనుకూలతలపై అధ్యయనం జరుపుతున్నట్లు తెలుస్తోంది.

డిమాండ్ మేరకు..

- ఎగుమతులు, దిగుమతులు సరుకు రవాణకు రాష్ట్రంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు (బహుళవిధ సరుకు రవాణా సేవల సముదాయం) కావాలని తెలంగాణలో పారిశ్రామికవేత్తల నుంచి డిమాండ్ ఉన్నది.
- ఈ క్రమంలో కేంద్రం గత కొన్ని నెలల క్రితం తెలంగాణ సహా మరో 16 రాష్ట్రాలకు లాజిస్టిక్ పార్కులను మంజూరు చేసింది.
- రూ.10వేల కోట్ల పెట్టుబడుల సమీకరణ లక్ష్యంగా ఈ పార్కు ఏర్పాటు చేయనున్నారు.
- ప్రత్యక్షంగా లక్ష, పరోక్షంగా 2లక్షల మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేయనున్నారు.
- ఇంతటి భారీ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.
- ఈ ప్రాజెక్ట్‌కు వందల ఎకరాల్లో భూమి అవసరం ఉండడంతో భూసేకరణ సమస్యగా పరిణమించింది.
- రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పరిశీలనలు జరిపినా ఒకేచోట వందల ఎకరాల భూమి దొరకడం కష్టతరంగా మారడంతో గజ్వేల్ నియోజకవర్గంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.
- ప్రధానంగా మనోహరాబాద్ సమీపంలో స్థలం లభ్యతను గుర్తించిన పరిశ్రమల శాఖ భూసేకరణపై రెవెన్యూ శాఖతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం.

ఈ ప్రాంతంలోనే ఎందుకంటే..

- భారీ భూసేకరణతో పాటు లాజిస్టిక్ పార్కుకు సమీపంలో ఆరు వరుసల జాతీయ రహదారి, విమానాశ్రయం, రైల్వేలైన్‌తో అనుసంధామై ఉండడం తప్పనిసరి.
- ఇలాంటి అర్హతలన్నీ గజ్వేల్‌కు ఉండటంతో ఈ ప్రాంతంపై సంబంధిత అధికారులు దృష్టిసారించినట్లు తెలుస్తోంది.
- మనోహరాబాద్‌లో లాజిస్టిక్ పార్కు ఏర్పాటు చేస్తే సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారి, హైదరాబాద్, కొత్తపల్లి రైల్వేలైన్, విమానాశ్రయానికి 100కిలోమీటర్ల దూరం ఉండడం కలిసి వచ్చే అంశాలుగా చెప్పవచ్చు.
- మరోవైపు మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే మార్గంలో గజ్వేల్ రైల్వేస్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే హబ్‌గా మార్చేందుకు నిర్ణయించింది.
- హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ కారణంగా రైల్వేస్టేషన్ల విస్తరణ కష్టతరంగా మారడం, సమీపంలో ఉన్న గజ్వేల్‌ను విస్తరించి న్యూఢిల్లీ, ముంబయి, కలకత్తా, బెంగుళూరు, తిరుపతి, షిర్డీ లాంటి ప్రధాన నగరాలకు కొత్త రైళ్లను ప్రారంభించాలనే ఆలోచనలో ఉన్నారు.
- ఇప్పటికే గజ్వేల్‌లో ప్రతిష్టాత్మక రేక్ పాయింట్ ఉండడం, ఇక్కడ గూడ్స్ రైలు సేవలు కూడా ప్రారంభం కావడంతో లాజిస్టిక్ హబ్‌కు ప్రాథమిక అడుగులు పడడంతో ఈ ప్రాంతంపై ప్రాధాన్యం పెరిగింది.
- ఈ అంశాలన్నీ పరిగణలోకి తీసుకొని ఇక్కడ లాజిస్టిక్ పార్కును ఏర్పాటు చేయడానికి సీరియస్‌గా పరిశీలన జరుపుతున్నారు.
- ఇటీవల ములుగు మండలం కొత్తూర్ గ్రామంలో అధికార యంత్రాంగం భూసేకరణ చేపట్టింది.
- మనోహరాబాద్ కాకపోతే ఈ మండలాన్ని పరిగణలోకి తీసుకుంటారా? అనే చర్చ జరుగుతోంది.
- కొత్తూర్ సైతం 44వ నంబర్ జాతీయ రహదారికి, రైల్వేలైన్‌కు సమీపంలో ఉండటంతో కొత్తగా పరిశీలన చేస్తున్నట్లు పరిశ్రమల శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి 'సాక్షి'కి తెలిపారు.

క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో ఏపీజీవీబీ రాష్ట్ర చైర్మన్



ఏడుపాయలలో ఏపీజీవీబీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్

పాపన్నపేట(మెదక్): ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఆంధ్రప్రదేశ్ గామీణ వికాస్ బ్యాంక్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ బుధవారం ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకున్నారు. పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ సారా శ్రీనివాస్ ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దుర్గమ్మకు పూజలు చేసిన అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

సిద్దిపేటకమాన్: పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణంలోని మోడ్రన్ బస్టాండ్ చౌరస్తా, విక్టరీ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తాల్లో నాలుగు రోజుల క్రితం తమ సిబ్బందితో కలిసి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. తనిఖీల్లో 18 మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన జడ్జి రూ.43 వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

యువతి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణఖేడ్ పరిధిలోని బుచన్‌పల్లి గ్రామానికి చెందిన నర్సమ్మ కూతురు పవిత్ర కొద్ది రోజుల క్రితం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ఓడీఎఫ్ కాలనీలో ఉండే పిన్ని ప్రమీల ఇంటికి వచ్చింది. ఈనెల 8వ తేదీన ప్రమీల ఆస్పత్రికి వెళ్తున్నానని పవిత్రకు చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చే చూసే సరికి పవిత్ర(19) కనిపించలేదు. పవిత్ర కోసం తెలిసిన వారిని, బంధువుల విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ క్రైమ్‌పై ఫిర్యాదు

హుస్నాబాద్: హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాధితుడికి కొంపల్లి యాక్సిస్ బ్యాంక్ నుంచి టెలిగ్రామ్ వచ్చింది. అందులో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ గ్రూపులో డబ్బులు పెట్టుబడి పెడితే మంచి లాభం వస్తుందని తెలిపారు. ఈ మెసేజ్‌ను నమ్మిన బాధితుడు ఫోన్ పే ద్వారా రూ.15 వేలు రియల్ ఎస్టేట్ గ్రూపునకు పంపాడు. వెంటనే ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. తాను మోసపోయానని గ్రహించి వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు.

గొర్రెలు, మేకల అపహరణ

వర్గల్(గజ్వేల్): గుర్తు తెలియని దుండుగులు అర్ధరాత్రి గొర్రెలను, మేకలను అపహరించుకుపోయారు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. బుధవారం బేగంపేట ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మజీద్‌పల్లికి చెందిన సలేంద్రి రమేశ్‌కి 200 పైగా గొర్రెలు, మేకలు ఉన్నాయి. వాటి కోసం ఇంటి సమీపంలో కొట్టం ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు మూడు మేకపోతులు, గొర్రె పొట్టేలు, నాలుగు మేకలను ఎత్తుకెళ్లారు. అలికిడికి సమీపంలో ఉన్న చిన్నాన్న ఐలయ్య కేకలు వేయగా, రమేశ్ అక్కడికి చేరుకుని దొంగలను వెంబడించేలోపే వారు వ్యానులో పారిపోయారు. ఎత్తుకెళ్లిన మేకలు, గొర్రెల విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కరాటేలో చిచ్చరపిడుగు

- అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న బాలిక
- గోల్డ్‌మెడల్ సాధించిన నితన్యసిరి
- అభినందించిన మంత్రులు





నితన్యసిరిని అభినందిస్తున్న మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

మెదక్‌జోన్: పద్నాలుగేళ్లు కూడా నిండని ఆ బాలిక కరాటేలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తోంది. బరిలో దిగిందంటే తన పంచ్‌లు, కిక్‌లతో ప్రత్యర్థులను మట్టికరిపిస్తోంది. ఇటీవల గోవాలో జరిగిన అంతర్జాతీయ కరాటేపోటీలో గోల్డ్‌మెడల్ సాధించింది. ఆ బాలికను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు.

మెదక్ పట్టణం జంబికుంటకు చెందిన కృష్ణ, కీర్తి దంపతుల కుమార్తె నితన్యసిరి. పట్టణంలోని గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఐదేళ్లుగా పట్టణంలోని కరాటేమాస్టర్ నగేశ్ వద్ద కరాటే నేర్చుకుంటోంది. కరాటే పట్ల ఆమెకున్న ఆసక్తిని గమనించిన కరాటే మాస్టర్లు నగేశ్, దినకర్ ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. జాతీయ, అంతర్జాతీ, స్థాయిలో ఏడు మెడల్స్‌ను సాధించింది.

ఏసియాలో బంగారు పతకం

ఈ ఏడాది మార్చి 29, 30, 31వ తేదీల్లో గోవాలో మూడో ఏసియన్ ఓపెన్ కరాటే అండర్ 14 విభాగంలో మన దేశం తరపున నితన్యసిరి పాల్గొంది. ఇందులో బూటాన్, నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఉజ్బెకిస్తాన్, చైనా, జపాన్, భారతదేశంతో పాటు పలు దేశాలకు చెందిన సుమారు 3,500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించింది.

అభినందించిన మంత్రులు

మెదక్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని నితన్యసిరి కరాటే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించడం దేశానికి, రాష్ట్రానికి గర్వకారణమని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నితన్యసిరిని ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి పతకాలు మరిన్ని సాధిచా లని రాష్ట ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. అలాగే ఆమెకు కోచ్‌లుగా వ్యవహరించిన కరాటే మాస్టర్లు నగేశ్, దినకర్‌ను అభినందించారు.

సీసీ కెమెరాలను నిత్యం మానిటర్ చేయాలి

సిద్దిపేట సీపీ శ్వేత



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: సీసీ కెమెరాలను నిత్యం మానిటర్ చేయాలని, పని చేయని వాటిని వెంటనే మరమ్మతు చేయించాలని సిద్దిపేట సీపీ శ్వేత పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో గజ్వేల్ డివిజన్ పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2013, 2014, 2015 పెండింగ్ ట్రయల్ కేసులను త్వరగా డిస్పోజల్ చేసే విధంగా కోర్టు అధికారులకు సహకరించాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు సైబర్ నేరాలు, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో 60 రోజుల్లో విచారణ పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. కేసుల్లో శిక్షల శాతం పెంచాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన బ్లాక్ స్పాట్స్ ప్రదేశాలను అధికారులు సందర్శించి ప్రమాదాల నివారణకు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. టెక్నాలజీని వినియోగించి కేసులను ఛేదించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, గజ్వేల్ ఏసీపీ రమేశ్, సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, గజ్వేల్ డివిజన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ఆర్టీసీ అద్దె బస్సు బోల్తా

- డ్రైవర్‌కు స్వల్పగాయాలు
- తప్పిన ప్రమాదం



కల్వర్టును ఢీకొని బోల్తా పడ్డ బస్సు

కొల్చారం(నర్సాపూర్): మెదక్ ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు ఫిట్నెస్ కోసం వెళ్తూ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీ కొనడంతో బోల్తాపడింది. ఈ సంఘటన కొల్చారం మండలం కిష్టాపూర్ గ్రామ శివారులోని మెదక్ నర్సాపూర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. కొల్చారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ డిపోకు చెందిన టీఎస్35 టీ 3443 నంబరుగల పల్లె వెలుగు బస్సును డ్రైవర్ రామక్కపేట నగేశ్ గౌడ్ ఫిట్నెస్ టెస్ట్ కోసం మెదక్ నుంచి సంగారెడ్డి ఆర్‌ఎం కార్యాలయానికి తీసుకెళ్తున్నాడు. కిష్టాపూర్ శివారు మలుపు కల్వర్టు వద్ద డ్రైవర్ కళ్లు తిరగడంతో అదుపు తప్పి కల్వర్టుకు ఢీకొంది. దీంతో బస్సు ఒక్కసారిగా రోడ్డుపై బోల్తా పడటంతో బస్సు ముందు చక్రాలు ఊడిపోయాయి. ఆ సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చిన్నపాటి గాయాలతో డ్రైవర్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో హద్దురాళ్ల తొలగింపు



హద్దురాళ్లను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని అంతక్కపేట గ్రామ శివారు మల్లన్న ఆలయ సమీపంలో బుధవారం సర్వే చేయగా ప్రభుత్వ భూమిగా తేలింది. సర్వే నంబర్ 238లో సుమారుగా రెండెకరాలకుపైగా ఉందని ఆర్‌ఐ రాజు అంచనా వేశారు. గతంలో ఈ భూమిలో కొంతమంది సాగు చేసేవారు. ఇటీవల ఈ భూమిని విక్రయించగా సదరు కొనుగోలుదారులు సర్వేయర్ ద్వారా సర్వేలు చేయించడంతో ఇది ప్రభుత్వ భూమిగా గుర్తించారు. దీంతో ఏర్పాటు చేసుకున్న హద్దురాళ్లను ఆర్‌ఐ రాజు నేతృత్వంలో రెవెన్యూ సిబ్బంది ఆ హద్దురాళ్లను తొలగించారు. ఈ భూమి ప్రధాన రహదారికి పక్కనే ఉండటంతో ఏదైనా ప్రభుత్వ భవనాలు, ఇతర అవసరాలకు ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఆర్‌ఐ రాజు మాట్లాడుతూ ఎవరైన ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇది ప్రభుత్వ భూమి అని సూచిక బోర్డు పెట్టాలని గ్రామ సర్పంచ్ ఇర్రి లావణ్యరాజిరెడ్డికి సూచించారు.

పట్టా భూమి పరిశీలన



భూమిని పరిశీలిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): అన్యాక్రాంతమైన పట్టా భూమి గుర్తింపు కోసం బుధవారం రెవెన్యూ, అటవీ అధికారులు పరిశీలించారు. మండల పరిధి కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన శివయ్య పట్టా భూమి సర్వే నంబర్ 349లో ఎకరా 37 గుంటల భూమి వివాదాస్పదంగా మారింది. తన భూమిని కబ్జా చేశారని పట్టాదారుడు శివయ్య సీఎంఓ, గవర్నర్ తో పాటు పలువులు అధికారులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం సర్వేయర్ ఏడీ శ్రీనివాస్, డిప్యూటీ రేంజ్ అధికారి రవికుమార్, స్థానిక సర్వేయర్ యదగిరి పట్టాభూమి గుర్తింపు కోసం పరిశీలించారు. ఉన్నతధికారులకు నివేదిక అందజేస్తామని అధికారులు చెప్పారు. అధికారులు వచ్చి వెళ్తున్నారని, తన భూమి గుర్తింపు చర్యలు చేపట్టడం లేదని రైతు శివయ్య వాపోయాడు.

ఇద్దరి ఆత్మహత్య



దుర్గయ్య మృతదేహం

ఝరాసంగం(జహీరాబాద్): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలా ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని పంచలింగాల గ్రామానికి చెందిన కొమరి దుర్గయ్య(45) మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి కూడా మద్యం తాగి రావడంతో ఎందుకు తాగావని భార్యాపిల్లలు మందలించారు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోని బాత్రూంలో ఉరి వేసుకున్నాడు. మృతుడి సోదరుడు లాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేందర్ రెడ్డి తెలిపారు.



విశ్వనాథంగౌడ్ మృతదేహం

టేక్మాల్(మెదక్): చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన విరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్ గ్రామానికి చెందిన వెంకటాపూరం విశ్వనాథంగౌడ్ (57) మంగళవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మద్యం తాగితే ఆరోగ్యం పాడవుతుందని భార్య లలిత మందలించింది. దీంతో మనస్తాపానికి గురై చిన్న చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం ఉదయం చెరువులో శవమైతేలాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు.

దొరికిన చెక్కు అందజేత

నిజాయితీ చాటుకున్న ట్రాన్స్‌కో ఉద్యోగి

మెదక్ రూరల్: రోడ్డుపై దొరికిన చెక్కును పోగొట్టుకున్న వ్యక్తికి తిరిగి అందజేసి నిజాయితీని చాటుకున్నాడు ట్రాన్స్‌కో ఉద్యోగి. మెదక్ మండలం ఖాజీపల్లి శివారులో బైక్‌పై వస్తున్న ట్రాన్స్‌కో ఉద్యోగి సంగయ్య రూ.80 వేల విలువగల చెక్కు దొరికింది. చెక్కు పై సంతకం చేసి నేరుగా బ్యాంక్ లో డ్రా చేసుకొనే విధానంగా ఉన్నప్పటికీ, ఇతరుల సొమ్ము పై ఆశ పడకుండా చెక్కుపై ఉన్న ఫోన్ నంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలిపాడు. చిన్నశంకరంపేట మండలం జంగరాయికి చెందిన పరమేశ్వర రెడ్డి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో రూ.80 వేలు డ్రా చేసుకోవడానికి ఎవరి పేరు రాయకుండా కేవలం అమౌంట్ మాత్రమే వేసి రెండు వైపులా సంతకాలు చేసి జేబులో పెట్టుకున్నాడు. మెదక్ వస్తున్న క్రమంలో చెక్కు పోగొట్టుకున్నాడు. దాని కోసం వెతుకుతున్నట్టు చెప్పడంతో పరమేశ్వర్‌ను మెదక్ పోలీస్‌స్టేషన్‌కు పిలిచి, పోగొట్టుకున్న చెక్కును తిరిగి ఇచ్చారు. దొరికిన చెక్కును నిజాయితీగా అందజేసిన సంగయ్యను పలువురు అభినందించారు.

హాస్టల్ వాచ్‌మెన్ ఆత్మహత్యాయత్నం

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రమైన ఝరాసంగం ఎస్సీ బాయ్స్ హాస్టల్ వాచ్‌మెన్ అశోక్ బుధవారం ఆత్మహత్యకు యత్నించాడు. వార్డెన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వాచ్‌మెన్ తన జీతం బ్యాంక్ ఖాతాను మరో బ్యాంక్‌కు బదిలీ చేసుకోవడానికి జీతం ఖాతా ఓటీపీ వివరాలు చెప్పమని హాస్టల్ వార్డెన్‌ను కోరాడు. వార్డెన్ ఈ విషయంలో బంధనలు పాటించాలని చెప్పడంతో మనస్తాపం చెందిన అశోక్ పురుగుల మందు తాగాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోక్సో చట్టంపై మాట్లాడిన వారికి నోటీసులు

నారాయణఖేడ్: పోక్సో చట్టంపై ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన వారికి నోటీసులు ఇవ్వనున్నట్లు నారాయణఖేడ్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి బుధవారం తెలిపారు. సిర్గాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసుతో పాటు మైనర్ బాలిక పాఠశాల గురించి కొందరు ప్రెస్ మీట్‌లు పెట్టి వివరాలు బహిర్గతం చేశారు. రహస్యంగా ఉంచాల్సిన వివరాలను బహిర్గతం చేస్తున్నారంటూ విద్యార్థి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వారిపై పోక్సో కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో..

నిజాంపేట(మెదక్): విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కె.వెంకటపూర్ గ్రామంలోని కాస గంగయ్య(59) మంగళవారం సాయంత్రం తాను కౌలుకు తీసుకున్న పొలానికి వెళ్లాడు. బోరు మోటారు రిపేరు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని గండమ్మ ఆలయ సమీప జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలంకు చెందిన మహిపాల్ (24) జీవనోపాధికై తెల్లాపూర్ వలసవచ్చాడు. బుధవారం తెల్లావారుజామున మహిపాల్ తన మిత్రుడు తేజతో కలసి బైక్‌పై పటాన్‌చెరు నుంచి లింగంపల్లి వస్తున్నారు. గండమ్మ ఆలయ సమీప జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. బైక్ నడుపుతున్న తేజ వేగంగా వచ్చి మట్టి కుప్పపైకి దూసుకెళ్లడంతో మహిపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మెదక్‌మున్సిపాలిటీ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మెదక్ శివారులో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ మండలం రాజ్‌పల్లి గ్రామానికి చెందిన దయాకర్ బైక్‌పై మెదక్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గం మధ్యలో పిల్లి కోటల్-రాజ్‌పల్లి రహదారిలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

కోహీర్(జహీరాబాద్): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండల కేంద్రమైన కోహీర్, బిలాల్‌పూర్ గ్రామాల మధ్య బుధవారం సాయంత్రం జరిగింది. ఎస్‌ఐ సురేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాండూర్ పట్టణానికి చెందిన షాయిన్‌బేగం(47) భర్త బాబుమియాతో కలిసి కోహీర్ పట్టణంలో బంధువుల ఇంటికి వచ్చి తిరిగి స్వగ్రామానికి స్కూటీపై వెళ్తున్నారు. రోడ్డు మధ్యలో గుంత ఉండటంతో షాహిన్ బేగం స్కూటీ పైనుంచి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడింది. వెంటనే చికిత్స నిమిత్తం కోహీర్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి జహీరాబాద్ ఆస్పతికి తరలిస్తుండగా మృతి చెందింది. భర్త బాబుమియా స్వల్పంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

మనోహరాబాద్(తూప్రాన్): కారు, ఆటో ఢీ కొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాళ్ళకల్ శివారులో ఇటుకలు తయారీ చేసే సత్యారాం ఆటో నడుపుకుంటూ ఒక్కసారిగా జాతీయ రహదారిపైకి వెళ్లాడు. అదే సమయంలో నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ఉన్న సత్యారాం గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పటాన్‌చెరు టౌన్: బైక్‌ను గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బుధవారం ఎస్‌ఐ దుర్గయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ అమీర్‌పేట్‌కు చెందిన మహేందర్‌రెడ్డి అత్తపూర్ నుంచి జహీరాబాద్‌కు బైక్‌పై ఈనెల 4వ తేదీన వెళ్తుండగా పటాన్‌చెరు మండలం ముత్తంగి సమీపంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం వచ్చి ఢీకొట్టింది. దీంతో మహేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం గచ్చిబౌలిలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బైక్‌ను ఢీకొట్టిన వాహనదారుడిపై చర్యలు తీసుకోవాలని బుధవారం మహేందర్ సోదరుడు నరేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పటాన్‌చెరుటౌన్: కారు, స్కూటీని ఢీ కొట్టిన ఘటనలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బుధవారం ఎస్‌ఐ దుర్గయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అందోల్‌కు చెందిన రోహిత్ రెడ్డి ఫిబ్రవరి 13వ తేదీన అందోల్ నుంచి హైదరాబాద్‌కు తన స్కూటీపై బయలుదేరాడు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ చౌరస్తా సమీపంలో వెనుక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో రోహిత్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం మెరుగుపడటంతో ఆలస్యంగా ఫిర్యాదు చేస్తున్నట్లు పోలీసులకు తెలిపాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దుబ్బాకరూరల్: బైక్‌ను కారు ఢీ కొట్టిన సంఘటన భూంపల్లి మండలంలోని చిట్టాపూర్ వద్ద బుధవారం రాత్రి జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎనగుర్తి గ్రామానికి చెందిన కాకి స్వామి భూంపల్లి నుంచి సిద్దిపేట వెళ్తున్నాడు. ఇదే క్రమంలో సిద్దిపేట నుంచి భూంపల్లి వెళ్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టడంతో స్వామికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నీటమునిగి రైతు మృతి

శివ్వంపేట(నర్సాపూర్): చెరువులో ఇష్టరాజ్యంగా తవ్విన గుంతల కారణంగా రైతు అందులోపడి మృతిచెందాడు. ఈ విషాదకర సంఘటన మండల పరిధి పోతులబోగూడ గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుమ్మరి ప్రభు(29) వ్యవసాయంతో పాటు పశుపోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం పశువులు గ్రామ శివారులో ఉన్న ఊర చెరువులోకి నీరు తాగేందుకు వెళ్లగా వాటిని మళ్లించేందుకు చెరువులోకి దిగిన కుమ్మరి ప్రభు జేసీబీలతో తవ్విన గుంతల్లో నీరు చేరి ఉండటంతో నీటమునిగాడు. గమనించిన సమీప రైతులు చెరువులో గాలించగా మృతదేహం బయటపడింది. భార్య స్వరూప సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించింది. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

విద్యుత్ అక్రమంగా వినియోగిస్తున్న..

ఇద్దరిపై కేసు నమోదు

నర్సాపూర్: విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు విద్యుత్ శాఖ విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ రాంచందర్‌రావు తెలిపారు. విజిలెన్స్ అధికారుల బృందం బుధవారం నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లో పర్యటించి తనిఖీలు చేపట్టారు. శివ్వంపేట మండలంలోని దొంతి గ్రామానికి చెందిన నవీన్ తన ఇంటికి అక్రమ విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంతో అతడిపై కేసు నమోదు చేసి అరెస్ చేశారు. అలాగే నర్సాపూర్ మండలంలోని రుస్తుంపేటకు చెందిన సందిల వెంకటేశ్ కూడా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తుండటంతో అతడిపై కేసు నమోదు చేశారు. వారిని మెదక్ అడిషనల్ జ్యుడిషీయల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేటు కోర్టులో హాజరు పరిచినట్లు విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

కోతులు, కుక్కల బారి నుంచి కాపాడండి



వినతిపత్రం అంద చేస్తున్న పట్టణ యువకులు

నర్సాపూర్: కోతులు, కుక్కల బారి నుంచి కాపాడాలని పలువురు పట్టణ యువకులు బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. పట్టణంలో రోజురోజుకు కోతులు, కుక్కల బెడద ఎక్కువైందని, ఇటీవల కుక్కలు దాడిలో ఏడేళ్ల చిన్నారిని గాయపర్చిన ఉదంతాన్ని, కోతుల దాడిలో బాలుడు మరణించిన విషయాన్ని గుర్తు చేశారు. చాకలి నర్సింహులును కోతి కరవడంతో తీవ్రంగా గాయపడనట్లు చెప్పారు. ప్రజలు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారని, తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ స్పందిస్తూ సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

సెంట్రింగ్ డబ్బాల దొంగ అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

మిరుదొడ్డి(దుబ్బాక): సెంట్రింగ్ డబ్బాలను దొంగిలించిన దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భూంపల్లి ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద 93 సెంట్రింగ్ డబ్బాలు చోరీ చేసినట్లు దుబ్బాక మున్సిపాలిటీ చేర్వాపూర్ వార్డుకు చెందిన రాజు మేస్త్రీ ఈనెల 10వ తేదీన ఫిర్యాదు చేశాడు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా నంబర్ లేని వాహనంపై వచ్చిన ఓ వ్యక్తి వాహనాన్ని విడిచి పెట్టి పారిపోతుండటతో అతడిని పట్టుకున్నారు. నిందితుడు దుబ్బాక మండలం రామక్కపేటకు చెందిన శనిగరం శ్రీకాంత్‌గా గుర్తించారు. భూంపల్లి డబుల్ బెడ్ రూంల వద్ద ఉన్న 93 సెంట్రింగ్ డబ్బాలను తానే ఎత్తుకెళ్లి అమ్ముకున్నట్లు ఒప్పుకున్నాడు. సెంట్రింగ్ డబ్బాలను కొన్న వ్యక్తిపై కేసు నమోదు చేయడంతో పాటు వాటిని స్వాధీనం చేసుకున్నారు. కాగా శ్రీకాంత్‌పై దుబ్బాక పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోరీ కేసులు ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మాకు న్యాయం చేయండి

- మా డబ్బులు మాకు ఇప్పించండి
- లద్నూరు గౌడ్ కులస్తులు వేడుకోలు



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

మద్దూరు(హుస్నాబాద్): తమ భూమిని గ్రామ సర్పంచ్ బాబాయి కొంత కబ్జాచేసి సాగు చేస్తున్నడని, సర్పంచ్ తమకు న్యాయం చేయాలని లద్నూరు గ్రామ గౌడ కులస్తులు డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసి అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 448, 449, 549 సర్వే నంబర్‌లో ఎనిమిది ఎకరాల 32 గుంటల భూమి ఆరుగురి పేరిట ఉంది. వీరి భూమి పక్కనే సర్పంచ్ సుదర్శన్ బాబాయి జీడికంటి రామచంద్రం పొలం ఉంది. బాధితుల భూమిలో కొంత కబ్జా చేసి సాగు చేస్తున్నాడు. ఆర్‌ఓఆర్ పద్ధతిలో రామచంద్రం కబ్జా చేసిన ఎకరం పట్టాదారు పాస్‌పుస్తకంలో నమోదు చేయించుకున్నాడు. ఈ వ్యవహారంపై సర్పంచ్‌కు ఫిర్యాదు చేయగా చెరో రూ.2 లక్షలు ధరావత్తు చేస్తే పంచాయతీ పెడతామని తేల్చి చెప్పాడు. తాము చెల్లించిన రూ.2 లక్షల ధరావత్తు చెల్లించకుండా ఆరునెలలుగా తన చుట్టు తిప్పుకుంటున్నాడని బాధితులు ఆరోపించారు. ఈ విషయంపై ఎంపీడీఓ చొరవ తీసుకొని తమ భూమి, డబ్బులు ఇప్పించాలని వేడుకుంటున్నారు. ఈ విషయంపై సర్పంచ్‌ను వివరణ కోరగా తాను ఎవరివద్ద డబ్బులు తీసుకోలేదని, తీసుకున్నట్లయితే పంచాయతీ, గ్రామస్తులు తీసుకునే చర్యలకు తాను సిద్ధమని చెప్పాడు.